# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 124 VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: ఆదివారం 24 మే 2026








2వ పేజీలో...




2వ పేజీలో...

## జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ



మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి : జిల్లాలో తొలి విడతగా మంజూరైన అక్రెడిటేషన్ కార్డులను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేశారు. జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా జర్నలిస్టులకు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డీపీఆర్వో) శ్రీనివాస్, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా బ్యూరోలు, సిబ్బంది, ఫోటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

## రోజ్‌గార్ మేళా ద్వారా యువతకు ఉద్యోగాలతో పాటు సాధికారత: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, (సమయం ప్రతినిధి): నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు సాధికారత కల్పించే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ 'రోజ్‌గార్ మేళా' కార్యక్రమానికి రూపకల్పన చేశారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో నిర్వహించిన 19వ విడత రోజ్‌గార్ మేళాలో భాగంగా శనివారం సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంలోని ఆరు శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన 218 మంది యువతీయువకులకు నియామక పత్రాలు అందజేశారు. 2022 నుంచి నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళాల ద్వారా లక్షలాది మంది యువతకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖలు, పీఎస్‌యూల్లో ఖాళీలను భర్తీ చేస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. ప్రస్తుతం యువత ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని, అంకుర సంస్థలు, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాలని, తమ కోసం కష్టపడ్డ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఆదుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన 19వ విడత రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.










# సంపాదకీయం

## ముసుగులు తొలగిన మతతత్వం!

'వారు నాకు ఓటు వేయలేదు. వారి బాగోగులకు నేను బాధ్యత వహించను'-- పశ్చిమ బెంగాల్ శాసనసభకు కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే రితేశ్ తివారీ అన్న మాటలవి. ఈ ఉద్ఘాటన మానవ ధర్మ ప్రేరితమేనా? ఒక్క క్షణం ఆలోచించండి. ఆ మాటల్లోని అనైతికత, దుర్మార్గం అర్థమవుతుంది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రజాప్రతినిధి అలా మాట్లాడవచ్చునా? పరిపాలన, పౌరసత్వ హక్కులు ఇప్పుడు మతపరమైన ఓటింగ్ సరళిపై ఆధారపడి ఉన్నాయని ఆ ప్రజాప్రతినిధి ప్రభావశీలంగా సూచించడమే కాదూ ఆ ప్రకటన? ముస్లింలు తనకు ఓటు వేయనప్పుడు తాను ప్రాతినిధ్యం వహించేందుకు వారు సరైన అర్హులు కారని ఆ బెంగాలీ ఎమ్మెల్యే ఆ మాటలతో చెప్పకనే చెప్పాడు. రవీంద్రుడి ఆత్మ క్షోభించి ఉంటుంది. విశాల భారతావని ఆ మహాకవిని మరచిపోనట్లయితే కొత్త 'ప్రజాప్రతినిధి' కుత్సిత పలుకులకు భగ్గుమనేది కాదూ? అలా జరగలేదు! ఇదే, బహుశా, ఈ బెంగాల్ ముచ్చటలోని అత్యంత ఆందోళనకరమైన విషయం. వర్తమాన భారతదేశంలో నేడు మనం కంటున్నవీ వింటున్నవీ కేవలం మతతత్వ రాజకీయాలు కావు. అవి ఇంతకు ముందు కూడా ఉన్నాయి. ఇప్పుడు మనం చూస్తోంది మతతత్వ రాజకీయాల సర్వవ్యాపకత్వం. అవును, అవి సర్వసాధారణమైపోయాయి. ఆ బెంగాలీ అన్న మాటలను గతంలో ఎవరైనా వదరి ఉంటే వారి రాజకీయ జీవితాలకు అవి భరతవాక్యాలు అయివుండేవి. అయితే ఇప్పుడు అవి కేవలం ఎన్నికల ప్రలాపమని, పట్టించుకోవల్సినంత ముఖ్యమైనవి ఏ మాత్రం కావని కొట్టివేస్తున్నారు! మత ప్రాతిపదికన ప్రజలను సమీకరించేందుకు రాజకీయులు ఇంకెంత మాత్రం సంకోచించడం లేదు. గతంలో గోప్యంగా చేసిన ఆ పనిని ఇప్పుడు బాహాటంగా అడ్డూ అదుపులేని రీతిలో నిస్సంకోచంగా చేస్తున్నారు. అందుకే కాబోలు భారత జాతీయ కాంగ్రెస్‌ను 'కొత్త ముస్లిం లీగ్' అని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు అభివర్ణించారు. రిజిజు వ్యాఖ్య వెనుక ఉన్న వాదన ఏమిటో నిశితంగా చూద్దాం. అసోం, బెంగాల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు అందరూ దాదాపుగా ముస్లిం అభ్యర్థులే అయినందున కాంగ్రెస్ ఒక మతతత్వ పార్టీగా పరిణమించింది. అవును, అసోంలో ఎన్నికైన 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 18 మంది ముస్లింలే. అలాగే బెంగాల్‌లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు ఇరువురూ ముస్లింలే. సరే, కేరళలో కాంగ్రెస్ మిత్రపక్షం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎన్నికల్లో జయాపజయాలను ప్రభావశీలంగా నిర్ణయించే రాజకీయ శక్తి. అయితే కాంగ్రెస్‌ను మతతత్వ పార్టీగా నిందిస్తున్నవారు ఒక వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 650 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో అత్యధికులు ముస్లిమేతరులే. అయినప్పుడు కాంగ్రెస్ మతతత్వ పార్టీ ఎలా అయింది?

ఆ ప్రశ్నకు సమాధానం అంక గణితంలో కాకుండా రాజకీయ సందేశం-- ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు చేసే ప్రసంగాలు, ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారం-- లో ఉన్నది. ముస్లింల రాజకీయ ప్రాతినిధ్యాన్ని అనుమానాస్పదం చేయడమే అసలు లక్ష్యం. ప్రధానస్రవంతి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులుగా ముస్లిం అభ్యర్థులు చెప్పుకోదగిన సంఖ్యలో ఎన్నికైనప్పుడు సదరు పార్టీపై మతతత్వ పార్టీ అనే ముద్ర వేయడమే అటువంటి వ్యాఖ్యలు చేసేవారి అభీష్టం. మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యాన్ని చట్టవిరుద్ధం చేయడం, మెజారిటీ వర్గ ఆధిపత్యాన్ని జాతీయ వాదంగా చూపడమే రిజిజు వ్యాఖ్య పరమార్థం. ఈ రాజకీయ విలోమం చాలా చాలా ప్రమాదకరమైనది. బెంగాల్‌లో సువేందు అధికారి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన హిందువులకు బీజేపీకి ఓటువేయమని బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. గెలిచిన తరువాత వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే ఏ ప్రతిపక్ష నాయకుడు అయినా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ముస్లిం ఓటర్లకు తమ పార్టీకి ఓటువేయమని విజ్ఞప్తి చేసి ఉంటే ఏమయివుండేది?

లౌకికవాదాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత హిందువులపైనే ఎందుకు మోపుతున్నారని పలువురు తరచు ప్రశ్నిస్తున్నారు. ముస్లిం ఓటర్లు ప్రధానంగా ముస్లిం అభ్యర్థులకే ఎందుకు ఓటు వేస్తున్నారు? ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం నుంచి హిందూ అభ్యర్థి విజయం సాధించగలడా? ఇవి న్యాయబద్ధమైన ప్రశ్నలే. వీటికి సమాధానం ఒక రాజకీయ వాస్తవాన్ని గుర్తించడంలో ఉన్నది: భారత జనాభాలో హిందువులు 80శాతంగా ఉన్నారు. పరిపూర్ణ భద్రతా భావంతో నిండు ఆత్మ విశ్వాసంతో ఉన్న మెజారిటీ హిందువులు మాత్రమే దేశం మెజారిటేరియన్ జాతీయవాదంలోకి జారిపోకుండా నివారించగలరు.

సరే, లౌకికవాదం బలహీనపడడం బీజేపీతో మాత్రమే ఆరంభమయిందా? అలా భావించడం, ఆ సంక్షోభానికి ఆ పార్టీనే తప్పుపట్టడమంటే ఆత్మ వంచన చేసుకోవడమే అవుతుంది. లౌకికవాద పార్టీలుగా పరిగణన పొందుతున్న రాజకీయ పక్షాలు రెండు చారిత్రక తప్పిదాలకు పాల్పడ్డాయి. ముస్లింల సామాజిక పురోగతి, ఆర్థికాభ్యుదయానికి చిత్తశుద్ధితో కృషి చేయకుండా వారిని తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఓటు బ్యాంకుగా చూడడం మొదటి చారిత్రక నేరం. మితవాద ముస్లిం మతాచార్యుల ఒత్తిడికి లొంగిపోయి షాబానో కేసు తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడమైనా, లేదా ప్రాంతీయ పార్టీలు తమ ప్రతీకాత్మక రాజకీయాల ద్వారా ముస్లింల అభద్రతా భావాన్ని స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడమైనా ముస్లింలకు తరచు పంపుతున్న సందేశం: మాకు ఓటు వేయండి. మిమ్ములను హిందూ మితవాదుల నుంచి సంరక్షిస్తాం. సంరక్షణ రాజకీయంగా మారింది. అయితే సాధికారత అరుదుగా లభించింది. లౌకికవాద పార్టీలు పాల్పడిన రెండో చారిత్రక తప్పిదం కూడా మొదటిదాని వలే లౌకికవాద విలువలకు తీవ్ర నష్టం చేసింది. హిందూ ఓట్లను బీజేపీకి కోల్పోతామనే భయంలో లౌకికవాదాన్ని దృఢవిశ్వాసంతో పరిరక్షించడానికి బదులుగా మృదు హిందుత్వను పాటించడంలో ఉత్సాహం చూపాయి. తద్వారా బీజేపీని సమర్థంగా ఎదుర్కోగలమని విశ్వసించాయి. 1980ల్లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం బాబ్రీమసీదుకు దశాబ్దాలుగా వేసి ఉన్న తాళాలను తెరవడాన్ని గుర్తు చేసుకోండి.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి


**-అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్.**



వనపర్తి. సమయం ప్రతినిధి: వర్ష సూచన నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా, అత్యంత వేగంగా పూర్తి చేయాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, అలాగే వీపనగండ్ల గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలను, తూకం ప్రక్రియను పరిశీలించి అధికారులకు, రవాణా కాంట్రాక్టర్లకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వర్షం పడే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచి, ధాన్యం రాశులపై కప్పి ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించేందుకు తగినన్ని లారీలను, వాహనాలను వెంటనే ఏర్పాటు చేయాలని వాహన కాంట్రాక్టర్లను గట్టిగా ఆదేశించారు. రవాణాలో ఎలాంటి ఆలస్యాన్ని సహించేది లేదన్నారు. వీపనగండ్ల గోదామును పరిశీలించిన ఆయన, వాహనాల అన్‌లోడింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి తహసీల్దార్ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గోదాముకు వచ్చే వాహనాలకు క్రమపద్ధతిలో టోకెన్లు జారీ చేసి, టోకెన్ నంబర్ల ప్రకారమే అన్‌లోడింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. గోదాముల్లో ధాన్యపు బస్తాల అన్‌లోడింగ్, స్టాకింగ్ పనుల కోసం అవసరమైన సంఖ్యలో హమాలీలను (కార్మికులను) మరియు అవసరమైన ఇతర పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని గోదాము నిర్వాహకులకు స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ వార్షిక తనిఖీలు

**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ వార్షిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, ఎఫ్ఐఆర్ నమోదు విధానం, పెండింగ్ కేసులు, సీసీటీఎన్ఎస్ నమోదు, రౌడీ షీట్స్, బీట్ బుక్స్ తదితర అంశాలను పరిశీలించి ప్రతి కేసును సమయానుకూలంగా ఆన్లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఆమె, నేరాల నియంత్రణలో వాటిని సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు.ద్విచక్ర వాహనాలు నడిపే పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా స్టేషన్‌కు వచ్చే సిబ్బందిని లోపలికి అనుమతించవద్దని స్పష్టం చేశారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,




సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, ఎస్సైలు విజయభాస్కర్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి మోదీ ప్రభుత్వం దోచుకుంటోంది: మల్లికార్జున్ ఖర్గే..

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎనిమిది రోజుల వ్యవధిలోనే మూడు సార్లు ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ధరలతో దేశ ప్రజలను బీజేపీ ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌పై రోజువారీగా రూ.1,000 కోట్ల పన్నులను కేంద్రం విధిస్తోందని.. అయినా మోదీ ప్రభుత్వానికి అత్యాశ తీరలేదని ఖర్గే విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ.. ఆ ప్రయోజనాలను దేశ ప్రజలకు అందించలేదని ఖర్గే నిప్పులు చెరిగారు. ఇది ప్రజలను నిర్దాక్షిణ్యంగా దోచుకోవడమేనని మండిపడ్డారు. సంక్షోభం వచ్చినప్పుడు ఎన్నికల ప్రచారంలో బీజేపీ మునిగిపోయిందని, ఆ తర్వాత ఇప్పుడు త్యాగం గొప్పతనం గురించి చెబుతోందని ఆయన విమర్శించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఇంధన ధరలు అత్యంత తక్కువగా ఉన్నాయని కమలం పార్టీ నేతలు చెబుతున్నారని ఖర్గే ఆగ్రహించారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత అంతా బాగానే ఉందని భారతీయులకు ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారని అన్నారు.కానీ అదే సమయంలో ఇతర దేశాలు తమ పౌరులకు చురుకుగా సహాయాన్ని అందించాయని మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ఇంధనంపై ఇటలీ ఎక్సైజ్ సుంకాలను తగ్గించి పౌరులకు ఉపశమనం కలిగించిందని చెప్పారు. ఆస్ట్రేలియాలో ఎక్సైజ్ సుంకం తగ్గించడంతో పెట్రోల్ ధరలు లీటరుకు సుమారు రూ.17 తగ్గాయని ఆయన తెలిపారు. చమురుపై జర్మనీ పన్నులు తగ్గించడంతో ఇంధన ధరలు లీటరుకు రూ.17 నుంచి రూ.19 వరకు తగ్గిపోయాయని వెల్లడించారు. అలాగే యూకేలో ప్రతి ఇంటికీ చమురు సంబంధిత ఆర్థిక సహాయంగా ప్రభుత్వం 100 పౌండ్లు అందించడంతో పాటు ఇంధనం, విద్యుత్ రెండింటిపైనా పన్నులను తగ్గించిందని ఖర్గే చెప్పుకొచ్చారు.ఐర్లాండ్ 250 మిలియన్ యూరోలను సాయం కింద ప్రజలకు అందించిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు తెలిపారు. దీంతో పెట్రోల్ ధర లీటరుకు సుమారు 0.15 యూరోలు, డీజిల్ ధర లీటరుకు 0.20 యూరోలు తగ్గాయని చెప్పారు. మన దేశంలో మాత్రం రేట్లు పెంచుతూ దోపిడీ చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దోపిడీ ద్వారా వస్తున్న సొమ్ము ఎవరికి చేరుతోంది? అంటూ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వంలో నాయకత్వ సంక్షోభం చాలా స్పష్టంగా కనిపిస్తోందని, ఈ విషయాన్ని ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయులు గ్రహించారని మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు.

# ప్రధాని మోదీతో మార్కో రుబియో భేటీ.. భారత్-అమెరికా సంబంధాలపై కీలక చర్చలు..

మొదటి పేజీ తరువాయి

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్ పర్యటన తొలి రోజే ప్రధాని నరేంద్ర మోదీతో న్యూఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ భేటీలో కీలక అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, రక్షణ, వాణిజ్యం, ఇండో-పసిఫిక్ భద్రత అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం.

రుబియో ముందుగా కోల్‌కతాకు చేరుకుని మదర్ థెరిసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రధాన కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఢిల్లీకి చేరుకుని ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. రుబియో భారత పర్యటనలో ముఖ్యంగా క్వాడ్ భాగస్వామ్యం, చైనా ప్రభావం, సరఫరా గొలుసులు, రక్షణ సహకారం, ఇంధన భద్రత వంటి అంశాలు ప్రధాన చర్చగా మారాయి. భారత్-అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన లక్ష్యంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించడంపై ప్రధాని మోదీ, అమెరికా విదేశాంగ మంత్రి రుబియో మధ్య చర్చలు జరిగినట్టు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. అలాగే స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌ను ముందుకు నడిపించే మార్గాలపై కూడా ఇరువురి మధ్య ఫలవంతమైన చర్చలు జరిగినట్టు తెలిపారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** ప్రజల ప్రాణ భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శుక్రవారం రాత్రి 16 పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, చెక్‌పోస్టుల వద్ద పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మహబూబ్‌నగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న తనిఖీలను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా పరిశీలించి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్యతో పాటు సిబ్బంది విధుల నిర్వహణపై సమీక్ష చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, కార్లలో సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.శుక్రవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో 552 ద్విచక్ర వాహనాలు, 378 కార్లు, ఆటోలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 13 వాహనాలను సీజ్ చేయగా, 64 ఈ-చలాన్లు జారీ చేశారు. అదనంగా 12 ఈ-పెట్టి కేసులు, 14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రమాద రహిత మహబూబ్‌నగర్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

# రెవెన్యూ-ఇరిగేషన్ శాఖల సమన్వయంతో ప్రాజెక్టులు వేగవంతం

**సాగునీటి ప్రాజెక్టులకు భూ సేకరణ నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**





**నాగర్ కర్నూల్ ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు.పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు జిల్లాలో అమలవుతున్న ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు, ప్రాజెక్టుల ఇంజినీర్లు, అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతి ప్రాజెక్టు వారీగా వివరాలు ఆరా తీశారు. ఏ ప్రాజెక్టుకు ఎంత భూమి అవసరం, ఇప్పటివరకు ఎంత భూమి సేకరించబడింది, ఇంకా ఎంత భూమి సేకరించాల్సి ఉంది అనే అంశాలపై పూర్తి గణాంకాలతో నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణలో జరుగుతున్న ఆలస్యానికి గల కారణాలు, రైతుల అభ్యంతరాలు, కోర్టు కేసులు, పరిహారం చెల్లింపుల స్థితి వంటి అంశాలను కూడా సమగ్రంగా పరిశీలించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా పనులు వేగవంతం చేయాలని, భూ సేకరణ అనేది ఏ ప్రాజెక్టు పురోగతికైనా కీలకమైన దశ అని, భూ సేకరణ దశలో చిన్నపాటి ఆలస్యం జరిగినా మొత్తం ప్రాజెక్టు పనులపై ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ సూచించారు. అందుకే ప్రతి మండల స్థాయిలో ప్రత్యేక సమన్వయ బృందాలను ఏర్పాటు చేసి సమస్యలను అక్కడి కక్కడే పరిష్కరించాలని కలెక్టర్ ఆర్డీవో లకు సూచించారు. రైతులతో సానుకూల చర్చల ద్వారా భూసేకరణను వేగవంతం చేయాలని, వారికి చట్టప్రకారం న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ప్రాజెక్టుల పురోగతిని మరింత వేగవంతం చేయడానికి రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి వారం పురోగతి నివేదికలు సమర్పించాలని, పెండింగ్ సమస్యలను స్థాయివారీగా సమీక్షించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో వేలాది ఎకరాల భూమికి సాగునీరు అందుబాటులోకి వచ్చి వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖల ఎస్సీలు పార్థసారథి, సత్యనారాయణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణ, ఆర్డీవోలు సురేష్ బాబు , జనార్దన్ రెడ్డి, యాదగిరి బన్సీలాల్ తాహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై ఎమ్మెల్యేకు సమగ్ర నివేదిక



**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి సమగ్ర నివేదిక సమర్పించారు. నియోజకవర్గంలోని 199 ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన విద్యా సమన్వయకర్తలు జగపతి రావు, హర్షవర్ధన్ రెడ్డి, డి. వెంకట నర్సయ్య యాదవ్, ఫరూక్ హుస్సేన్ పాఠశాలల ప్రస్తుత పరిస్థితులపై రూపొందించిన నివేదికను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. నివేదికలో పాఠశాలలకు అవసరమైన భౌతిక వనరులు, మైనర్–మేజర్ మరమ్మత్తులు, మౌలిక వసతుల కల్పన, పాఠ్యాంశాల బోధనకు అవసరమైన విద్యా వాలంటీర్ల నియామకం వంటి కీలక అంశాలపై సమగ్ర సమాచారం పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పాఠశాల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక సమర్పించిన విద్యా సమన్వయకర్తల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాబోయే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా కోర్టు డ్యూటీ అధికారులు సమర్థవంతంగా పని చేయాలి జిల్లా అదనపు ఎస్పీ:రాజేష్ మీనా

**పెండింగ్ NBWలు, సమన్లు త్వరితగతిన అమలు చేయాలని ఆదేశం**

**సాక్షులు, బాధితులను సమయానికి కోర్టుకు హాజరు పరచాలి**

**కోర్టు డ్యూటీ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేస్తేనే నేర నియంత్రణ సాధ్యం**

**ప్రాసిక్యూషన్-పోలీసుల సమన్వయంతోనే కేసుల్లో శిక్షలు సాధ్యం**



**వనపర్తి :** నేరస్థులకు చట్టం ముందు తగిన శిక్ష పడేలా సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల సమర్పణతో కోర్టుల్లో శిక్షల శాతాన్ని పెంచడం పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, దీనివల్ల ప్రజల్లో భద్రతాభావం పెరగడంతో పాటు పోలీసులపై నమ్మకం, గౌరవం మరింత రెట్టింపు అవుతుందని వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా, వనపర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డీసీఆర్‌బీ అధికారులు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు గారు మాట్లాడుతూ.. కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని అన్నారు. కేసులు అనవసరంగా పెండింగ్‌లో ఉండకుండా కోర్టు డ్యూటీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదైన నాటి7 నుంచి కేసు పూర్తయ్యేంతవరకు అవసరమైన సాక్ష్యాలు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు సమయానికి కోర్టుకు చేరేలా చూడడం కోర్టు సిబ్బంది కీలక బాధ్యత అని పేర్కొన్నారు. సాక్షులు, బాధితులను సమయానికి కోర్టుకు హాజరు పరచడం, వారికి కేసు పురోగతిపై అవగాహన కల్పించడం ద్వారా కేసుల బలోపేతానికి సహకరించాలని సూచించారు. అదేవిధంగా కోర్టు సమాచారం, ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని సంబంధిత ఎస్సైలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు (NBWs), సమన్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన అమలు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, ప్రాసిక్యూషన్ విభాగం సమన్వయంతో పనిచేస్తేనే కోర్టులో కేసులు బలపడతాయని తెలిపారు. కేసులకు సంబంధించిన పత్రాలు, సాక్ష్యాలు, సాక్షుల హాజరు విషయంలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును బాధ్యతగా తీసుకుని సమగ్రంగా కోర్టులో ప్రవేశపెడితే శిక్షల శాతం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ, బాలాజీ నాయక్, డీసీఆర్‌బీ ఎస్సై తిరుపతి రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది, గోవింద్, రవీందర్ బాబు, డీసీఆర్‌బీ సిబ్బంది వెంకటన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు తదితరులు ఉన్నారు.

# కేసీఆర్ రావాలి..కాంగ్రెస్ పోవాలి అనే నినాదంతో ప్రతి కార్యకర్త పని చేయాలి....





(సమయం ప్రతినిధి గద్వాల) గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాన్ని మెట్టు శ్రీనివాస్,డా.ఆంజనేయ గౌడ్ హాజరయ్యారు.... ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు కు సభ్యత్వ నమోదు పై దిశా నిర్దేశం చేశారు....

ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు ఇంచార్జీలు మాట్లాడుతూ....

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలి అని అన్నారు..సభ్యత్వం సుసంపన్నం చేసుకొని ఆత్మవిశ్వాసం కలిగిన కార్యకర్తలకు శిక్షణతో పార్టీని పటిష్టం చేద్దాం అని అన్నారు..తెలంగాణ అస్తిత్వానికి రక్షణ కవచంగా నిలిచే కార్యకర్తల సమూహంగా సభ్యత్వ నమోదు జరగాలని పిలుపునిచ్చారు...సభ్యత్వ నమోదు 2021లో చేశాం.కేంద్ర ఎన్నికల సంఘం S.I.R ప్రారంభించింది ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.రేవంత్ రెడ్డి హయాములో రైతులు అధ్వాన పరిస్థితులు,హరిగోస ఎదుర్కొంటున్నారు.రేవంత్ పోవాలి,కెసిఆర్ రావాలి అనే నినాదంతో ప్రతి కార్యకర్త పని చేయాలి అని పిలుపునిచ్చారు. ప్రతిష్టాత్మకంగా సభ్యత్వ నమోదు చేపట్టాలి. పార్టీ కోసం నిరంతరం పని చేసే నాణ్యవంతమైన నాయకులను, కార్యకర్తలను తయారీ చేయాలి అని అన్నారు.రాశి కంటే వాసి ముఖ్యమని అధినేత కెసిఆర్ అన్నారు.సభ్యత్వ నమోదుతో సంస్థాగత నిర్మాణం పటిష్టం చేపట్టాలి అని అన్నారు.పార్టీ పట్ల విధేయత,నాయకుణ్ణి పట్ల విశ్వాసం ఉన్న కార్యకర్తలకు పార్టీ ప్రాధాన్యత ఇస్తుంది.సభ్యత్వం మొత్తం డిజిటల్ లో సాగుతుంది...తెలంగాణ అస్తిత్వానికి రక్షణ కవచంగా నిలిచే విధంగా సభ్యత్వ నమోదు జరగాలి.బూతు లెవల్ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి.బూతు లెవల్ సభ్యులకు శిక్షణ ఇచ్చి సభ్యత్వ నమోదు జరపాలి.సభ్యత్వ నమోదు తర్వాత సంస్థాగత ఎన్నికలు జరిపి కష్టపడి పనిచేసే నాయకులకు సముచిత స్థానం కల్పిస్తాం.జూన్ 25నుంచి జూలై 25వరకు S.I.R కార్యక్రమం ఉంటుంది ..ఈ కార్యక్రమంలో బూతు కమిటీ సభ్యులు చాలా అప్రమత్తంగా ఉండి మన సానుభూతిపరుల ఓట్లు కాపాడుకోవాలి.ఓట్ల తొలగింపులు,చేర్పులు,మార్పులు ,18ఏండ్ల నిండిన యువత ఓట్లు పట్ల జాగ్రత్త వహించాలి అని అన్నారు.....

ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ...

గద్వాల నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తిస్థాయిలో చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టిందని దీనికి ప్రతి కార్యకర్త సహకరించాలని కోరారు.గద్వాల నియోజకవర్గం సభ్యత్వ నమోదులో ముందుండే విధంగా చర్యలు తీసుకుందామని అందుకు నాయకులు,కార్యకర్తల సహకారం ఎంతో అవసరమన్నారు..రానున్న ఎన్నికలకు ఇప్పటినుంచే కార్యకర్తలు సన్నద్ధం కావాలని,ఉద్యమనేత కేసీఆర్ స్ఫూర్తితో పార్టీని బలోపేతం చేసి, మళ్లీ బీఆర్ఎస్ పాలనను తెచ్చుకుందామని ఆయన పిలుపునిచ్చారు..కేసీఆర్ నాయకత్వంలో బూత్ లెవల్ నాయకత్వం,పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఆయన సొంతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్,నాగర్ దొడ్డి వెంకట్రాములు,మాజీ జడ్పీటీసీలు పద్మ వెంకటేశ్వర రెడ్డి,బాసు శ్యామల, జి.రాఘవేంద్ర రెడ్డి,చక్రధర్ రావు, ఆతుకూరి రెహమాన్,కోటేష్,పటేల్ జనార్దన్ రెడ్డి,మోనేష్,కురవ పల్లయ్య,గంజిపేట రాజు, సూర్య గౌడ్, కౌన్సిలర్లు దుబన్న,పులిపాటి వెంకటేష్, చంటన్న,చీ= జగదీష్,చిత్తరి కిరణ్, గువ్వల గోపాల్,నరసింహులు,మోహన్ యాదవ్,రామకృష్ణ,కమ్మరి రాము, సర్పంచులు డేవిడ్,సత్యాన్న, ఆశీర్వాదం, తిమ్మప్ప,నరసింహులు,ఉప సర్పంచ్,వార్డు మెంబర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

# ఒక తరం బాగుండాలని ఆలోచన మేము చేస్తుంటే, తమ కుటుంబమే బాగుండాలని ఆలోచిస్తోంది ఒక కుటుంబం : ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే






(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) : ఒక తరం బాగుండాలని ఆలోచన మేము చేస్తుంటే , తమ కుటుంబమే బాగుండాలని ఆలోచిస్తోంది ఒక కుటుంబం" అని విమర్శించారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి .. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని ఐడీఓసీ లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళా ద్వారా ఎంపికైన ఉద్యోగార్థులకు ఆఫర్ లెటర్లను అందజేశారు. అలాగే వివిధ క్రీడల్లో విజేతలైన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించి, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు, ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేసి, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. డిగ్రీ కాలేజీలలో జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రారంభించి యువతకు ఉపాధి అవకాశాలను పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు తగ్గినా, యువతకు నైపుణ్యాలు ఉంటే ఎక్కడైనా ఉద్యోగాలు పొందగలరనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే ఈ చర్యల ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు. విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తోందన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఇంజనీరింగ్, లా కాలేజీలు, ట్రిపుల్ ఐటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, అడ్వాన్స్ లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. "తెలంగాణ రైజింగ్ విజన్ 2047" లక్ష్యంగా రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలపడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువత అవసరాలకు అనుగుణంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయంగా "భారత్ ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తూ 40 లక్షల మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, గ్రీన్ ఫార్మా, రీసెర్చ్ ఏ ఇన్నోవేషన్ రంగాలలో పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అయితే, గతంలో మంత్రిగా పనిచేసిన ఒక నాయకుడు విదేశాలకు వెళ్లి, ఈ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. యువత భవిష్యత్తు కంటే ఒక కుటుంబ ప్రయోజనాలను ముందుకు పెట్టడం సరైంది కాదని ఆయన విమర్శించారు. దేశంలోని ప్రముఖ కంపెనీలను కూడా ఈ ప్రాజెక్ట్ పరిధిలోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు ఉన్నాయని, పలు జోన్లుగా అభివృద్ధి చేసి భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్రంలోనే పరిశ్రమలు ఏర్పా టు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభు త్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. యువతకు అవసరమైన శిక్షణ కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డివైఎస్ఓ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ ఎంపి ప్రవీణ్ కుమార్, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

నందిమల్ల.అశోక్, జిల్లా బి.ఆర్.ఎస్ మీడియా కన్వీనర్.



(సమయం ప్రతినిధి వనపర్తి): కె.సి.ఆర్ ముందుచూపుతో సమృద్ధిగా దిగుబడి సాధించిన రైతన్నకు ప్రభుత్వ నిర్లక్ష్యంతో ధాన్యం కొనుగోలు కాక రోజుల తరబడి వేచి చూస్తున్న ఉపశమనం లేకపోగా అకాలవర్షాలకు కళ్లెదుటే తమ ధాన్యం నీళ్ల పాలు అవుతుంటే కన్నీటి పర్యంతం అవుతున్న మహిళా రైతులను చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. మార్కెట్‌కు తీసుకొచ్చిన వరి,మక్కలు పాలకుల,అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడబోతున్నారు. తడిసిన వరి మొక్కజొన్న ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని నందిమల్ల.అశోక్ డిమాండ్ చేశారు. రైతు భరోసా ఇవ్వకున్నా, కరెంటు కోతలు విధించిన,యూరియా సకాలములో ఇవ్వకున్నా అష్టకష్టాలు పడి పండించిన పంటలు కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అశోక్ దుయ్యబట్టారు. రేపటి నుండి తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేయకుంటే బి.ఆర్.ఎస్ ఆధ్వర్యములో అలుపెరుగని పోరాటానికి సిద్ధపడుతామని నందిమల్ల.అశోక్ హెచ్చరించారు.

## తల్లిపాలు అమృతం కన్నా మిన్న

- ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే యెన్నం



(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) : చంటి పిల్లలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, డబ్బా పాలు ఇవ్వకూడదని ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. తల్లిపాలు శిశువుల ఆరోగ్యానికి అమృతం కన్నా మిన్నవని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగరంలోని జిల్లా జనరల్ ఆసుపత్రిలో ప్రసవం అయిన నియోజక వర్గానికి చెందిన మహిళలకు "యెన్నం హెల్త్ కిట్"లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తల్లులకు శిశు సంరక్షణ, ముఖ్యంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం, గత సంవత్సరం ఏప్రిల్ నెలలో ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్రంలోని నాల్గవ "మదర్ మిల్క్ బ్యాంక్"ను సందర్శించి, దాని కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మిల్క్ బ్యాంక్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 2000 మంది చిన్నారులకు తల్లి పాలను అందించినట్లు తెలిపారు. చంటి పిల్లలకు అవసరమైతే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉన్న ధాత్రి మిల్క్ బ్యాంక్ నుండి తల్లి పాలను పొందవచ్చని, అక్కడ వైద్యులు కూడా అందుబాటులో ఉండి తగిన సూచనలు, సలహాలు ఇస్తారని తెలిపారు. నవజాత శిశువుల తల్లులు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ధాత్రి మిల్క్ బ్యాంకు కు తల్లి పాలను డొనేట్ చేస్తున్న పలువురిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, సాదతుల్లా, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ధాత్రి ఫౌండేషన్ డైరెక్టర్ కాశీనాథ్, సభ్యులు రమేష్, డాక్టర్ ప్రనీత తదితరులు పాల్గొన్నారు.





## కాక్రోచెస్ జనతా పార్టీ" ఏర్పాటు దేశ యువత ఆవేదనకు ప్రతీక

(సమయం ప్రతినిధి హైదరాబాద్) : దేశ యువతను "బొద్దింకలతో" పోల్చిన అత్యున్నత న్యాయ వ్యవస్థకు చెందిన న్యాయమూర్తి సూర్య కాంత్ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయని, ఆ వ్యాఖ్యలపై యువతలో పెరిగిన నిరసన, ఆవేదనకు ప్రతీకగా "కాక్రోచెస్ జనతా పార్టీ" పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రారంభమైన వ్యంగ్యాత్మక ప్రతిస్పందన ఈ దేశ యువత మనోభావాలను స్పష్టంగా ప్రతిబింబిస్తోందని హిమాయత్ నగర్ లోని సత్య నారాయణ రెడ్డి భవన్ లో జరిగిన సమావేశంలో అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఈ సందర్బంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర. మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గత 12 సంవత్సరాలుగా ఏఐవైఎఫ్ చేస్తున్న ఉద్యమాల చైతన్య ప్రతిబింబమే జెన్ జీ పోరాటమన్నారు. ఇది కేవలం సోషల్ మీడియా ట్రెండ్ కాదని, నిరుద్యోగంతో నలిగిపోతున్న యువత ఆవేదన అని అన్నారు . ఇది పరీక్షల అవకతవకలతో విసిగిపోయిన విద్యార్థుల వ్యంగ్య నిరసన అని, అవకాశాలు లేక, అవమానాలు మాత్రమే ఎదుర్కొంటున్న తరం యొక్క ఆత్మగౌరవ పోరాటంగా వారు అభివర్ణించారు . దేశంలో కోట్లాది మంది యువత ఉద్యోగాల కోసం పోరాడుతుంటే, ప్రభుత్వ ఖాళీలు భర్తీ కాకపోతే, పేపర్ లీకులు భవిష్యత్తులను నాశనం చేస్తుంటే, వారి బాధలను అర్థం చేసుకోవాల్సిన వ్యవస్థ వారినే "బొద్దింకలు"గా చూడటం దురదృష్టకరమన్నారు . ఈ పరిస్థితుల్లో యువత వ్యంగ్య రూపంలో తమ నిరసనను వ్యక్తం చేయడం సహజ ప్రజాస్వామ్య స్పందనేనని వారు అన్నారు. యువతను అవమానించే ఈ వ్యాఖ్యలు ఒక వ్యక్తి మాటలు మాత్రమే కావని, అవి ఈ దేశంలో పెరుగుతున్న అధికార అహంకారానికి ప్రతిబింబమన్నారు . ప్రశ్నించే యువతను




చిన్నచూపు చూడటం, నిరసన తెలిపే వారిని అవమానించడం, హక్కులు అడిగితే ఎగతాళి చేయడం, ఇవన్నీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతాలుగా చూడాలన్నారు . ఈ దేశాన్ని నిర్మించేది కార్పొరేట్లు కాదు, కష్టపడే యువత అని అన్నారు. రైల్వే స్టేషన్లలో, కోచింగ్ సెంటర్లలో, నిరుద్యోగ ర్యాలీలలో కనిపించే యువతే ఈ దేశ భవిష్యత్తు. వారిని "కాక్రోచెస్"గా చూడటం అంటే భారత యువశక్తిని అవమానించడమే అని వారు అన్నారు. కాక్రోచెస్ జనతా పార్టీ సామాజిక మాధ్యమ ఖాతాలను నిలిపివేయడం తీవ్రంగా ఖండనీయమైన చర్య అన్నారు . ప్రజాస్వామ్యంలో వ్యంగ్యం, విమర్శ, నిరసన వ్యక్తీకరణ భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) ప్రతి పౌరుడికి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హామీ ఇస్తుందన్నారు. యువత తమపై జరిగిన అవమానానికి ప్రతిస్పందనగా సోషల్ మీడియా వేదికగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తే వాటిని అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. ప్రశ్నించే గొంతులను బ్లాక్ చేయడం, వ్యంగ్యాన్ని కూడా భరించలేని స్థితికి వ్యవస్థలు చేరడం ప్రమాదకర పరిణామమని, ప్రజాస్వామ్యంలో అసమ్మతి స్వరం దేశద్రోహం కాదని . సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేయడం ద్వారా యువత ఆవేదనను అణచలేరన్నారు. కాబట్టి "కాక్రోచెస్ జనతా పార్టీ" సామాజిక మాధ్యమ ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని, భావ వ్యక్తీకరణ హక్కులపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నామని "కాక్రోచెస్ జనతా పార్టీ" రూపంలో వ్యక్తమవుతున్న వ్యంగ్య నిరసనను అణగదొక్కే ప్రయత్నాలు కాకుండా, యువత ఎందుకు ఈ స్థాయిలో ఆవేదన చెందుతున్నారో పాలకులు, వ్యవస్థలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు . ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం, న్యాయం అందించలేని వ్యవస్థ, భవిష్యత్తుపై భరోసా కల్పించలేని పాలకులు, ఇప్పుడు యువత గౌరవాన్నే అవమానించే స్థితికి దిగజారడం దేశానికి మంచిది కాదని, దేశ యువతకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఇటువంటి అవమానకర వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఖాద్రీ డిమాండ్ చేస్తోందన్నారు.

# పదరలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు





(సమయం ప్రతినిధి నాగర్ కర్నూల్) నాగర్ కర్నూల్ పార్లమెంట్ అచ్చంపేట నియోజకవర్గంలోని పదరా మండల రైతు వేదికలో నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేతలు" కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి , అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని రైతుల కు అవగాహన కల్పించారు.అదేవిధంగా మద్దిమడుగు దేవాలయం దగ్గర ప్రమాదానికి గురైన షాపులకు నష్టపరిహారం ప్రభుత్వం ద్వారా వచ్చిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ

**పాల్గొన్న ఎంపీ మల్లురవి ఎమ్మెల్యే వంశీకృష్ణ**
**ప్రమాద బాధితులకు పరిహారం పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు**

ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. శాస్త్రవేతల సూచనలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ విధానాలను రైతులు వినియోగించుకొని పంటల నాణ్యతను పెంచి ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని సూచించారు. ముఖ్యంగా విత్తనాల ఎంపిక, నేల పరీక్షలు, సమతుల ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, పురుగులు , తెగుళ్ల నివారణపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు అండగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ప్రతి రైతు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు.పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో అత్యాధునిక హంగులతో ఇందిరా మహిళా శక్తి భవనం

**-వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి**



వనపర్తి. సమయం ప్రతినిధి: వనపర్తి జిల్లా కేంద్రంలో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి సూచించారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డితో కలిసి శనివారం వనపర్తి పట్టణంలోని శ్రీనివాసపూర్‌లో రూ.7.50 కోట్ల (రూ.5 కోట్లు ఇప్పటికే మంజూరు కాగా, అదనంగా మరో రూ. 2.50 కోట్ల) వ్యయంతో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా సమాఖ్య భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ భవన నిర్మాణానికి సంబంధించిన ఇంజినీరింగ్ మ్యాప్‌ను పరిశీలించి, జరుగుతున్న నిర్మాణ పనులను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవనం వద్ద నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్మించాలని, అలాగే కాంపౌండ్ వాల్ మరియు ఎలివేషన్ పనులను ఆకర్షణీయంగా, నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. భవన నిర్మాణం వల్ల ప్రభావితమవుతున్న వారికి ఇంటి స్థలాలు అందజేస్తామని ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి హామీ ఇచ్చారు. అలాగే భవన నిర్మాణ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి, త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఈ ఈ విజయ్ మోహన్, డి ఈ లక్ష్మి నారాయణ, ఏ ఈ భాస్కర్, తహసీల్దార్ రమేష్ రెడ్డి, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

## వీబిజిరామ్ చట్టం రద్దుకై పోరాడుదాం



(సమయం ప్రతినిధి ఆత్మకూరు) : వి బి జి రాంజీ చట్టం రద్దుకై పోరాడుదా మనీ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు యస్. అజయ్.సి ఐ టి యు జిల్లాసహాయకార్యదర్శి యస్. రాజు లు పిలుపు ఇచ్చారు. ఆత్మకూరు మండలం లోని బాలకిష్ట పూర్ బౌన్సింగ్ తాండ లొశనివారం నాడు మాట్లాడుతూ. ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు గత రెండు నెలలుగా కూలీపని చేసినడబ్బులు రాకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రతిరోజు ఉపాధి పని ప్రదేశంలో రెండు పూటల ఫోటో క్యాప్చర్ తీసే విధానంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు అడవులలో పనులు జరగడం వల్ల నెట్వర్క్ రాకపోవడంతో కూలీలు ఎంతో దూరం నుంచి వచ్చిన ఫోటోకాప్చర్ రాకపోవడంతో వెనుతిరిగి ఆరోజుపూర్తిగా పని కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని. నెట్వర్కు రానిప్రదేశంలో ఆఫ్లైన్ అటెండెన్స్ కు అవకాశం ఇవ్వాలనికోరారు పని ప్రదేశంలో మంచినీటి వసతి ప్రతిరోజు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ. తట్ట బుట్ట ఫస్ట్ ఎయిడ్ బాక్స్ పారలు. టెంట్లు సరపరచేయాలనీ కోరారు కొలతల పద్ధతిని రద్దుచేసి రోజు కూలి600 ఇవ్వాలని ఏడాదికి 200 ఉపాధి పని దినాలను కల్పించాలని మహాత్మా గాంధీ జాతీయ పథకం స్థానంలో కొత్తగా తెచ్చిన నరేగా స్కీంను రద్దుచేసి పాత పద్ధతిలోనే కేంద్రం 90 శాతం. రాష్ట్రం 10% నిధులను భరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి సిబ్బంది 2నెలల వేతనబకాయిలు ఇవ్వాలని. ఫీల్డ్ అసిస్టెంట్ లకు 26000కనీసవేతనం అమలు చేయాలనీ డీమాండ్ చెశారు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా భూమి లేని.పె దలకు ఏడాదికి యిచ్చే 12000.కు నిధులు ఇవ్వాలని కోరారు .పని ప్రదేశంలో టెంట్లు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలనీ కోరారు . ఈ కార్యక్రమం లొ మన్యం నాయక్. సాంతమ్మ. లక్ష్మమ్మ జామున. గడ్డం నాగేంద్రమ్మ. శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉరుములు మెరుపుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



(సమయం ప్రతినిధి గద్వాల్): ఉరుములు మెరుపుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి .చెట్లు, పూరి గుడిసెలు పాడు పడ్డ మట్టి ఇళ్లలో ఉండవద్దు సురక్షితమైన ప్రదేశానికి చేరుకోవాలని లిఎట్టి పరిస్థితుల్లో పిల్లలని బయటికి వదలకండి కరెంటు స్తంభాల దగ్గర ట్రాన్స్ఫారాల దగ్గర కరెంటు వైర్లె కింద ఎట్టి పరిస్థితుల్లో ఉండవ దని జోగులాంబ గద్వాల్,జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ తప్పెట్లమోర్స్ శీను మాట్లాడుతూ జిల్లాలో పడుతున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి పొలాల దగ్గర కరెంటు మోటార్స్ , కరెంటు టాటర్ వైర్లు చెట్ల దగ్గర ఎట్టి పరిస్థితుల్లో ఉండవద్దు ఉరుములు మెరుపులు గాలులు ఎదురవుతున్న సమయంలో సురక్షితమైన స్థలానికి చేరుకోవాలని అలాగే ఎట్టి పరిస్థితుల్లో గ్రామాల్లో చిన్నపిల్లల్ని బయటకు వదలకండి ఎట్టి పరిస్థితుల్లో పిల్లలని బయటికి వదలకండి కరెంటు స్తంభాల దగ్గర ట్రాన్స్ఫారాల దగ్గర కరెంటు వైర్లె కింద ఎట్టి పరిస్థితుల్లో ఉండవద్దు వీలైనంతవరకు సురక్షితమైన స్థలానికి చేరుకోవాలి పొలాల దగ్గర ఉన్నటువంటి రైతుల కూడా చెట్ల దాపుణకాని కరెంటు వైర్ల దగ్గర కానీ ఉండవద్దు అనుకోని పరిస్థితుల్లో వర్షపు తీవ్రతను కనిపెట్టలేకపోయాం కాబట్టి ప్రజలంతా ప్రభుత్వం గా ఉండాలని రోడ్ రవాణా చేసే వ్యక్తులు కూడా రోడ్డు పక్కన ఉన్న చెట్ల దగ్గర ఉండవద్దు వీలైతే సురక్షితమైన స్థలానికి చేరుకోండి లేకపోతే కాలి స్థలంలో నిలిచి ఉండండి వర్షాధారణ ఎక్కువ కావడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కరెంటు వచ్చిన పది నిమిషాల వరకు ఎవరు కూడా బయటకు వెళ్ళవద్దు ఏ వైరు తెగిపోయి షార్ట్ సర్కిల్ అయి ఉంటుందో ఎవరికి తెలియదు కాబట్టి కాసేపు వేచి ఉండి అత్యవసర పరిస్థితుల్లో ఉంటేనే బయటికి వెళ్ళండి లేకపోతే ఎవరు బయటకు వెళ్ళవద్దు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## సిట్ ముందు హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్

(సమయం ప్రతినిధి హైదరాబాద్) : సిట్ అధికారులు గత ప్రభుత్వం దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ.జి. మధుసూదన్ రెడ్డి (GMR) ఫోన్ ను ట్యాపింగ్ చేయడం జరిగిందని, ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి, వాంగ్మూలం అందజేయాలని కోరడంతో నేడు హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ.జి. మధుసూదన్ రెడ్డి (GMR) సిట్ ముందు హాజరై వాంగ్మూలం అందజేశారు.ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఇల్లీగల్‌గా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిందని, ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. గత ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతున్న నాటి టీపీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని కట్టడి చేయడానికి గత ప్రభుత్వం ఇల్లీగల్ గా ఫోన్ టాపింగ్ కు పాల్పడిందని, డీసీసీ అధ్యక్షులు గా ఉన్న సమయంలో మా ఫోన్లను ట్యాప్ చేయడం జరిగిందని, దానికి సంబంధించి సిట్ వాంగ్మూలం ఇవ్వాలని కోరడంతో వాంగ్మూలం ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## మంత్రి వాకిటి శ్రీహరి కృషితో దశాబ్దాల కల సాకారం దిశగా.. జక్కన్నపల్లి బీటీ రోడ్డు పనులు



(సమయం ప్రతినిధి మక్తల్) : తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నర్వ నుండి జక్కన్నపల్లి గ్రామం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ , AMC వైస్ చైర్మన్ కృష్ణ రెడ్డి , మండల నాయకులు జక్కన్నపల్లి గ్రామ ప్రజలు కలిసి పరిశీలించారు.దాదాపు కొన్ని దశాబ్దాలుగా గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న రహదారి కల త్వరలో నెరవేరబోతుండటంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ బీటీ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ బీటీ రోడ్డు పూర్తయితే జక్కన్నపల్లి గ్రామానికి రాకపోకలు సులభతరం కావడంతో పాటు గ్రామ అభివృద్ధికి కొత్త ఊపు రానుంది. ఈ కార్యక్రమంలో. జక్కన్న పల్లె గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్ గౌడ్ ,నర్వ మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు బద్దిపల్లి రాజారెడ్డి, మండల నాయకులు,బీసం రామకృష్ణ , వెంకట్రాంరెడ్డి, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు P.అశోక్ గౌడ్, బోయపాటి నరసింహ, ముష్టిపల్లి శ్రీకాంత్ రెడ్డి, తెలుగు సత్తన్న, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ యువకులు, ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## వనపర్తి BRS SIR బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితా RDO కు అందజేత



(సమయం ప్రతినిధి వనపర్తి) : వచ్చే జూన్ నెలలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్ట నున్న ఓటర్ల జాబితా "ప్రత్యేక సమగ్ర సవరణ " (SIR) ప్రక్రియలో భాగంగా BRS పార్టీ అధినేత కల్వ కుంట్ల చంద్రశేఖర్ రావు, BRS పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్: కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు అలాగే తెలంగాణ లిరాష్ట్ర వ్యవసాయశాఖ మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశానుసారం వనపర్తి " నియోజకవర్గంలోని వివిధ మండలాల, మున్సిపాలిటీల సంబంధిత BRS పార్టీ బాధ్యులు బూత్ లెవల్ ఏజెంట్ల "(BLAs) జాబితాను తయారు చేయటానికి యుద్ధప్రాతిపదికన శ్రమ్నించి అన్ని గ్రామాల నుండి మరియు మున్సిపాలిటీలో ఉన్న అన్ని వార్డులకు చెందిన BLA S జాబితాలను మిగతా అన్ని రాజకీయ పార్టీల కంటే ముందే ప్రపథంగా BRS పార్టీ తరపున పూర్తి స్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను మాకు అందించి ముందు వరుసలో నిలిచారని ఇది హర్షించ దగ్గ పరిణామం అని ఇందుకు సహకరించిన మాజీ మంత్రి: సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు RDO ఇట్టి కార్యక్రమంలో మాణిక్యం, రాళ్ల కృష్ణయ్య, వేణుయాదవ్, ధర్మానాయక్ , వెంకట్ సాగర్, జమీల్ అహమ్మద్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.




స్పోర్ట్స్ డెస్క్: వన్డే వరల్డ్‌కప్ 2027 టోర్నీకి ఇప్పటి నుంచే ఓపెనింగ్ జోడీపై టీమిండియా యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని సమాచారం. దిగ్గజ ఓపెనర్ రోహిత్ శర్మను ఫిట్‌నెస్ కారణాల దృష్ట్యా టోర్నీ నుంచి తప్పించాలని బీసీసీఐ సెలక్టర్లు భావిస్తున్నట్లు ఇటీవల వార్తలు వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు జోడీగా ఇషాన్ కిషన్‌ను ఆడిస్తూ.. బ్యాకప్ ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్‌ను ఎంపిక చేస్తారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో తాజాగా ఓ వార్త బయటకు వచ్చింది. మరి.. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం..రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌కు లోబడి.. అఫ్గానిస్థాన్ తో స్వదేశంలో జరిగే వన్డే సిరీస్‌లో ఆడతాడని బీసీసీఐ తెలిపింది. మరోవైపు.. అఫ్గాన్‌తో ఏకైక టెస్టుకు ఎంపికైన యశస్వి జైస్వాల్‌ను వన్డేలకు మాత్రం పక్కనపెట్టారు. ఈ నేపథ్యంలో శ్రీలంకలో భారత్–ఎ జట్టు తరఫున గనుక యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ నిలకడగా రాణిస్తే.. వన్డే వరల్డ్‌కప్ 2027 నేపథ్యంలో వైభవ్ పేరును సెలక్టర్లు పరిగణనలోకి తీసుకుంటారనే టాక్ వినిపిస్తోంది. ఈ విషయం గురించి బీసీసీఐ సన్నిహిత వర్గాలు ఓ స్పోర్ట్స్ బ్లాగర్‌కు తెలిపారు. 'వైభవ్ సూర్యవంశీ త్వరలోనే భారత జట్టులో ఆడబోతున్నాడు. భారత్–ఎ తరఫున అతడి ప్రదర్శనను బట్టి ఎంత త్వరగా జాతీయ జట్టులోకి వస్తాడన్నది తెలుస్తుంది. సెలక్టర్లు అతడి ఆట తీరును నిశితంగా పరిశీలిస్తున్నారు. వైభవ్ ఇలాగే నిలకడగా ఆడుతూ.. ఫామ్ కొనసాగిస్తే వన్డే వరల్డ్‌కప్ 2027 ఆడే భారత జట్టులో చోటు దక్కించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఒకవేళ వైభవ్ గనుక ఊహించని రీతిలో ఈ జట్టులోకి వస్తే.. భారత క్రికెట్‌లో అదొక సంచలనమే అవుతుంది. ప్రస్తుతం ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ తరఫున అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. అతడు 13 ఇన్నింగ్స్‌ల్లో 44.53 సగటుతో, 236కు పైగా స్ట్రైక్ రేట్‌తో 579 పరుగులు సాధించాడు. అతడికి ఈ సీజన్‌లో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.




ఇంటర్నెట్ డెస్క్: ముంబై ఇండియన్స్ స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ ఓ అభిమానికి క్షమాపణ చెప్పాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఐపీఎల్ 2026లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్లు తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో ఎంఐ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా ముంబై జట్టు బస చేసే హోటల్ దగ్గర ప్లేయర్లను చూడాలని వందలాది మంది అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఆ రద్దీలో రోహిత్ శర్మను చూడటానికి ఓ చిన్న అమ్మాయి కూడా ఎదురుచూస్తూ ఉంది. అయితే భారీ జనం, భద్రతా కారణాల దృష్ట్యా రోహిత్ శర్మ ఆమెను గమనించకుండానే ముందుకు వెళ్లిపోయాడు. దీంతో ఆ అమ్మాయి ఏడ్వడం మొదలుపెట్టింది. ఆ వీడియో సోషల్ మీడియాలో షేర్ చేయడంతో.. అది రోహిత్ శర్మ వరకు వెళ్లింది. దీంతో క్షమాపణ కోరుతూ హిట్‌మ్యాన్ ఓ స్పెషల్ వీడియో విడుదల చేశాడు. నన్ను క్షమించు.. ఆ సమయంలో ఈడెన్ గార్డెన్స్‌లో నిన్ను కలవలేకపోయాను. నేను నీ వీడియో చూశాను. మైదానం వెలువల, హోటల్ వద్ద రద్దీ, గందరగోళం ఉంటుంది. అందుకే నా దృష్టి నీపై పడలేదు. కానీ నీకు ఇప్పుడు మాటిస్తున్నాను.. మళ్లీ కోల్‌కతా వచ్చినప్పుడు కచ్చితంగా నిన్ను కలుస్తాను' అని రోహిత్ శర్మ ఆ వీడియోలో వెల్లడించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. 'అంతర్జాతీయ స్థాయి ప్లేయర్.. ఓ అభిమాని కోసం ఇలా సమయం కేటాయించి క్షమాపణ కోరడం చిన్న విషయం కాదు' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.




మొదటి పేజీ తరువాయి

ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో భాగంగా లఖ్‌నవూ వేదికగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, పంజాబ్ కింగ్స్ జట్లు తలపడనున్నాయి. టాస్ నెగ్గిన పంజాబ్.. ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో ఎల్ఎస్‌జీ తొలుత బ్యాటింగ్ చేయనుంది. కాగా పంజాబ్ జట్టుకు ఈ పోరు అత్యంత కీలకం. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంటాయి. ఇరుజట్లకు ఇదే చివరి లీగ్ స్టేజ్ మ్యాచ్. కాగా లఖ్‌నవూ జట్టు ఇప్పటికే టోర్నీ నుంచి ఎలిమినేట్ అయిన సంగతి తెలిసిందే. ఈ పోరులో నెగ్గడంతో పాటు.. ఇతర జట్ల ఫలితాల మీద పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ బెర్తు ఆధారపడి ఉంది.

**పంజాబ్ కింగ్స్ తుది జట్టు**

శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), ప్రభ్‌సిమ్రన్ సింగ్(వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, కూపర్ కనోలీ, సూర్యాంశ్ షెడ్గె, శశాంక్ సింగ్, అజ్మతుల్లా ఓమర్జాయ్, యాన్సెన్, విజయకుమార్ వైశాఖ్, అర్షదీప్ సింగ్, చాహల్

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: హర్‌ప్రీత్ బ్రార్, స్టోయినిస్, బార్ట్‌లెట్, విష్ణు వినోద్, ప్రవీణ్ దూబె

**ఎల్ఎస్‌జీ తుది జట్టు :** రిషబ్ పంత్(కెప్టెన్, వికెట్ కీపర్), జోష్ ఇంగ్లిస్, కులకర్ణి, నికోలస్ పూరన్, ఆయుశ్ బదోని, అబ్దుల్ సమద్, ముకుల్ చౌదరి, అర్జున్ టెండూల్కర్, షమి, ప్రిన్స్ యాదవ్, మొహ్సిన్ ఖాన్

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: షాబాజ్ అహ్మద్, దిగ్వేశ్ సింగ్, సిద్ధార్థ్, హిమ్మత్ సింగ్, ఆకాశ్ మహరాజ్ సింగ్




ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున ప్రాతినిధ్యం వహించిన యువ ప్లేయర్ ముకుల్ చౌదరి అద్భుతమైన ఆటతీరు కనబర్చాడు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలు చేశాడు. కేకేఆర్‌పై ఓడిపోతుందనుకున్న మ్యాచ్‌లో ఆఖరి వరకు క్రీజులో ఉండి జట్టును గెలిపించాడు. ఈ టోర్నీ నుంచి లఖ్‌నవూ జట్టు ఎలిమినేట్ అయిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ పార్టీ స్పాయిలర్‌గా మారిన ఎల్ఎస్‌జీ.. ఎలిమినేట్ అయ్యాక విజయాలు సాధిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో ముకుల్ చౌదరి ఐపీఎల్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ కంటే దేశవాళీ క్రికెట్ ఆడటమే కష్టమని వెల్లడించాడు.

'ఐపీఎల్‌లో మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే లక్షలాది మంది మమ్మల్ని చూస్తుంటారు. అయితే కొన్ని విషయాల్లో మాత్రం ఇక్కడ పరిస్థితులు చాలా సులభంగా అనిపిస్తాయి. ప్రత్యర్థి బౌలర్ల బలాలు, వ్యూహాలు ముందే తెలుస్తాయి. వీడియో విశ్లేషణలు, డేటా అందుబాటులో ఉంటాయి. దేశవాళీ క్రికెట్‌లో ఇలాంటివేమీ ఉండవు. ఐపీఎల్‌లో కొత్తగా వచ్చిన ప్లేయర్‌కి కొంత మానసిక ఒత్తిడి ఉంటుంది. అయితే ప్రశాంతంగా ఉండి.. ఫ్లోలో వెళ్లిపోతే దాన్ని అధిగమించవచ్చు. ఈ సీజన్‌లో నాకు అవకాశం దక్కుతుందని అనుకోలేదు. కానీ వచ్చినా సిద్ధంగా ఉండాలని అనుకున్నా. తుది జట్టులోకి తీసుకున్నారని తెలిసినప్పుడు కాస్త టెన్షన్ అనిపించింది. మ్యాచ్ సమయంలో ప్రేక్షకుల హోరు, కెమెరాలు.. ఇవన్నీ నాకు కొత్తగా అనిపించాయి. కానీ మైదానంలోకి వెళ్లిన తర్వాత పెద్దగా తేడా అనిపించలేదు. సులువుగా ఆడేయొచ్చనే ధీమా వచ్చింది' అని ముకుల్ చౌదరి వెల్లడించాడు.




ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. క్వాలిఫయర్ 1లో గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. అయితే గాయం కారణంగా జట్టుకు దూరమైన స్టార్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ ఫిట్‌నెస్ సాధించి జట్టులో చేరాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో సాల్ట్ ఆడకపోయినా.. ప్లే ఆఫ్స్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంది. సాల్ట్ గైర్హాజరీలో బెథెల్ ఓపెనర్‌గా వచ్చిన సంగతి తెలిసిందే. కానీ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో ఎస్ఆర్‌హెచ్‌పై వెంకటేశ్ అయ్యర్‌ను ఓపెనర్‌గా దింపారు. సాల్ట్ రావడంతో ఆర్సీబీకి జట్టు కూర్పు తలనొప్పిగా మారింది. గత రెండు మ్యాచ్‌ల్లో అద్భుతమైన ఫామ్ కనబరిచిన వెంకటేశ్ అయ్యర్‌ను తప్పిస్తారా? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో టీమిండియా దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ ఆర్సీబీకి పలు కీలక సూచనలు చేశాడు. 'సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఓడినా ఆర్సీబీ బ్యాటింగ్‌లో కొన్ని సానుకూల అంశాలు కనిపించాయి. ముఖ్యంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న వెంకటేశ్ అయ్యర్.. అద్భుతమైన ఆటతీరు కనబరుస్తున్నాడు. ఫిట్‌నెస్ సాధించిన ఫిల్ సాల్ట్ జట్టులోకి వస్తే.. వెంకటేశ్ అయ్యర్‌ను కాకుండా మరో ప్లేయర్‌ను తప్పించాలి. వెంకటేశ్ అయ్యర్ టాపార్డర్‌లో ఆడినప్పుడే తన అత్యుత్తమ ఆటను కనబరుస్తాడు. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌పై 73 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఎస్ఆర్‌హెచ్‌పై ఓపెనర్‌గా వచ్చి 19 బంతుల్లోనే 44 పరుగులు చేసి జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. ఫిల్ సాల్ట్ తిరిగి ఫిట్‌నెస్ సాధించడంతో ఆర్సీబీకి జట్టు ఎంపిక తలనొప్పిగా మారింది. ఈ విషయంలో మాత్రం మాకు స్పష్టమైన అభిప్రాయం ఉంది. వెంకటేశ్ అయ్యర్‌ను మాత్రం జట్టు నుంచి తప్పించే ప్రయత్నాలు చేయొద్దు. అతడి అవసరం ఇప్పుడు జట్టుకు ఉంది. సాల్ట్ జట్టులోకి వస్తే జితేశ్ శర్మను తప్పించండి. ప్రస్తుతం జితేశ్ ఫామ్‌లో లేడు. ఇక కీపింగ్ విషయానికొస్తే.. సాల్ట్ కూడా వికెట్ కీపర్ కాబట్టి ఆర్సీబీకి ఇబ్బంది ఉండదు' అని సెహ్వాగ్ సూచించాడు.




ఇంటర్నెట్ డెస్క్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే మూడు జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరుకోగా.. నాలుగో స్థానం కోసం పోటీ తీవ్రతరమైంది. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆ ఒక్క ప్లే ఆఫ్స్ బెర్తు కోసం పోటీ పడుతున్నాయి. టోర్నీ ఆరంభంలో వరుస విజయాలతో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న పంజాబ్ కింగ్స్.. అనూహ్యంగా గాడీ తప్పింది. వరుసగా ఏడు విజయాల తర్వాత ఆడిన అన్నింట్లోనూ ఓడి.. ప్లే ఆఫ్స్ బెర్తు కోసం శ్రమిస్తోంది. నేడు పంజాబ్.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో చావో రేవో మ్యాచ్ ఆడనుంది. మరి పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్‌కు వెళ్లాలంటే..

**సమీకరణాలు ఎలా ఉన్నాయంటే..**

పంజాబ్ కింగ్స్ ప్రస్తుతం ప్లే ఆఫ్స్ రేసులో ఉన్నప్పటికీ.. భవిష్యత్తు మాత్రం వారి చేతుల్లో లేదు. ఫస్ట్ పంజాబ్ చేయాల్సిన పని ఏంటంటే.. నేడు లఖ్‌నవూతో జరిగే పోరులో తప్పక గెలవాలి. అప్పుడు తాత్కాలికంగా నాలుగో స్థానానికి చేరుతుంది. అయితే అదే సమయంలో రాజస్థాన్ రాయల్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఓడిపోవాలి. రాజస్థాన్ ప్రస్తుతం 14 పాయింట్లతో పంజాబ్ కంటే ముందుంది. ముంబై ఇండియన్స్‌పై జరిగే పోరులో ఆర్ఆర్ ఓడితే పంజాబ్‌కు మార్గం సుగమనమవుతుంది.

**మరో ట్విస్ట్..**

లఖ్‌నవూపై పంజాబ్ కింగ్స్ గెలిచి.. ముంబైపై ఆర్ఆర్ ఓడినా కోల్‌కతా రూపంలో పంజాబ్‌కు ముప్పు పొంచి ఉంది. కేకేఆర్.. ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిస్తే నెట్‌రన్ రేట్ కారణంగా పంజాబ్‌కు షాక్ తగిలే అవకాశం ఉంది. ఉదాహరణకు పంజాబ్ కేవలం ఒక్క పరుగుతో లఖ్‌నవూపై గెలిస్తే.. కేకేఆర్ దాదాపు 52 పరుగుల తేడాతో ఢిల్లీపై విజయం సాధించాలి. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ఇది సాధ్యపడదు. కానీ ఇన్ని ట్విస్టులు ఇచ్చిన ఐపీఎల్ 2026లో ఏదైనా జరిగే అవకాశం లేకపోలేదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మరి పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్‌కు వెళ్లనుందా? లేదా? అనేది చూడాల్సి ఉంది.



# ఖాకీ కొలువు యోగా గెలుపు

**కూలి పనుల నుంచి కొలువు దాకా.. కొండల నడక నుంచి జాతీయ వేదికల దాకా ఆమె ప్రయాణం పెద్ద సవాల్. ఇద్దరు పిల్లల తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. ఖాకీ దుస్తుల్లో యోగాసనాలతో పతకాలు సాధిస్తున్నారు రావాడ రోహిణి. కష్టాలను నిచ్చెనగా మార్చుకుని శిఖరం చేరిన తన ప్రస్థానం గురించి ఆమె ఇలా చెప్పుకొచ్చారు. మాది శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలంలోని లింగం నాయుడుపేట. అక్కడ మూడో తరగతి వరకు చదువుకున్నా. తర్వాత అమ్మమ్మ పున్నమ్మను చూసుకోవాల్సి రావడంతో అక్కడికి పంపించారు. మా ఊరికి 30 కిలోమీటర్ల దూరంలోని సారవకోట మండలం బైదలాపురం అనే గిరిజన గ్రామం అది.**

సమయం ప్రతినిధి

అమ్మమ్మను చూసుకుంటూ ఐదో తరగతి వరకు చదువుకున్నా. తర్వాత హైస్కూలు. మాకు దగ్గరలో అంటే శ్రీముఖలింగం అనే ఊరు వెళ్లాలి. రోజూ రానుపోను 12 కిలోమీటర్లు కొండ మార్గంలో నడిచి వెళ్లేదాన్ని. ఉదయం 7.30కి బయలుదేరితే 9 గంటలకు స్కూలుకు చేరేదాన్ని. సాయంత్రం ఇంటికి చేరేప్పటికి ఆరు గంటలయ్యేది. ఇంట్లో ఉన్నదేదో తీసుకువెళ్లడమే. వర్షం, ఎండ.. ఉదైనా స్కూల్ మానడం నాకు తెలియదు. 8వ తరగతిలో అమ్మమ్మ కాలం చేయడంతో మళ్లీ మా ఊరు లింగంనాయుడుపేట వెళ్లిపోయా. అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని తిమడాంలో 9, 10 చదువుకున్నా. రోజూ రానుపోను 4 కిలోమీటర్లు నడకే.



## కూలి డబ్బులతో బస్సు చార్జీలు

కష్టాలు పడుతూనే పది పాసై ఇంటర్మీడియట్ నర్సన్నపేటలోని జూనియర్ కళాశాలలో చేరాను. రోజూ ఉదయం 6 గంటలకు బస్సు. అది మిస్సయిందంటే ఆ రోజు స్కూల్‌కి ఆబ్సెంట్. రెండో ఏడాది చదవుతుండగా అమ్మ ఆరోగ్యం పాడైంది. నేను, చెల్లి, నాన్న కూలి పనికి వెళితేగానీ ఇల్లు గడిచేది కాదు. అలా కాలేజీ సెలవు రోజున కూలికి వెళుతూ బస్సు చార్జీలకు వాటిని వాడుకుంటూ ఎలాగైతేనేం ఇంటర్ పూర్తి చేశాను. కానీ బస్సు చార్జీలు కూడా పెట్టుకోలేని స్థితిలో ఫీజులు కట్టుకోలేక డిగ్రీపై ఆశలు వదులుకున్నా. బుడితి జంక్షన్‌లోని నేతాజీ రెసిడెన్షియల్ స్కూల్‌లో టీచర్‌గా చేరాను. ఓ ఏడాది అలా గడిచింది. తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడంతో నరసన్నపేటలో డిగ్రీలో చేరాను.

## కానిస్టేబుల్‌గా ఎంపిక

మా అమ్మ నాగమ్మ, నాన్న సత్యనారాయణ, చెల్లి, నేను కూలి పనులకు వెళ్లేవాళ్లం. అమ్మకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో మేం ముగ్గురం కూలికి వెళ్లేవాళ్లం. రోజుకు నాన్నకు రూ.40, నాకు చెల్లికి రూ.20 చొప్పున వచ్చేది. కష్టాల నుంచి బయట పడాలంటే బాగా చదువుకొని ప్రభుత్వోద్యోగం సంపాదించాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నా. అదే పట్టుదలతో ఇంటర్ పూర్తయ్యాక టీచర్‌గా చేస్తూనే సీఆర్పీఎఫ్, ఎస్ఎ?ససీ, పోస్టల్, ఆర్‌ఆర్‌బీ ఇలా చాలా రాశాను. కూలి డబ్బులు ఇంట్లో ఇస్తే ఉద్యోగ దరఖాస్తు ఫీజుకు అవసరమైనపుడు అమ్మానాన్న ఇచ్చేవారు. అలా 2012లో మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి రాశా. దానిలో ఎంపికై 2014లో డిగ్రీ పూర్తి చేసిన వెంటనే శిక్షణకు వెళ్లిపోయా. అదే ఏడాది ఉద్యోగంలో చేరాను.

## అనుకోకుండా యోగాలోకి

రాజమండ్రి మహిళా పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్. అప్పట్లో ప్రతి శుక్రవారం పోలీసులకు రన్నింగ్ పోటీలుండేవి. నాకు స్కూల్ నుంచే లాంగ్ రన్నింగ్ అలవాటు. దాంతో పురుషుల కంటే ముందే లక్ష్యాన్ని చేరుకునేదాన్ని. అలా 2016లో ఒక రోజున అఖిలభారత పోలీస్ స్పోర్ట్స్ మీట్ ఉందని మెసేజ్ వచ్చింది. నేను రన్నింగ్ బాగా చేస్తానని అప్పటి స్టేషన్ రైటర్ శ్రీనివాసరావు, డీఎస్పీ భరత్‌మాతాజీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మమ్మల్ని మోటివేట్ చేశారు. ఓ తండ్రిలా మంచీచెడులు చెప్పేవారు. అలా ఆ పోటీల్లో పాల్గొన్నాను. అయితే అక్కడ రన్నింగ్ ఉండదని చెప్పారు. యోగాలో పాల్గొనాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ యోగా విలేజ్‌లో 45 రోజుల శిక్షణ. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకూ సాగేది. సాత్వికాహారం, తిన్న తర్వాత రెస్ట్. అయితే మొదటి మూడు రోజుల తర్వాత తీవ్రమైన ఒళ్లు నొప్పులు. నన్ను పంపేయండి వెళ్లిపోతానని చెప్పా. అప్పటి మా ఇన్‌చార్జి సీఐ కళ్యాణి నాకు నచ్చజెప్పారు. అన్నీ తట్టుకొని శిక్షణ పూర్తి చేశా. మొదటిసారి యోగా పోటీల్లో మూడో స్థానం దక్కింది. తర్వాత పెళ్లి, పిల్లలు. ఆపై కరోనా సంక్షోభం. ఇలా 2017 నుంచి 2021 వరకూ పోటీల్లో పాల్గొనలేదు.

## యోగాలో పీజీ చేయాలని..

నా భర్త నిడదవోలులో ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. నేను జిల్లా కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్నాను. మాకు ఏడేళ్ల లోహిత్, ఆరేళ్ల లాక్షిత ఉన్నారు. మాకు ఉద్యోగ బాధ్యతల వల్ల వాళ్లతో గడిపే సమయం తక్కువ. నేను యోగా పోటీలకు వెళితే మరీ ఇబ్బందిగా ఉంటోంది. పిల్లలను అత్త అప్పన్నమ్మ, తోడికోడలు చిన్నమ్మ చూసేవాళ్లు. ఇప్పుడు పక్కింటి వాళ్ల వద్ద ఉంచుతూ సమయం సర్దుబాటు చేసుకుంటున్నాం. యోగాలో పీజీ చేయాలని నా కోరిక. ఆ పోటీల్లో నేను మరింత రాణించాలి. నా శాఖకు కూడా మరింత పేరు సాధించాలనేది నా లక్ష్యం. ఆ సాధనకు నాకు సహకారం కూడా ఎంతో అవసరం. ఎవరూ కష్టాలు, కన్నీళ్లని ఆవేదనతో ఆగిపోవద్దు. ముఖ్యంగా మహిళలు విధిని ఎదిరించైనా అవకాశాలను విజయంగా మలుచుకోవాలి. మనకు, మన కుటుంబానికి, మన రాష్ట్రానికి.. దేశానికి పేరు తెచ్చుకోవాలి.

---



# పిల్లల్లో నాటుకునే నాడీ సమస్యలు

**సమయం ప్రతినిధి :** పిల్లలు నాడీ సమస్యలను పుట్టుకతోనే వెంటతెచ్చుకోవచ్చు. ఆ సమస్యలు పలు రూపాల్లోనూ ఉండవచ్చు. అయితే సమస్య ఏదైనా దాన్ని సకాలంలో గుర్తించి, సమర్థమైన చికిత్సను అందించగలిగితే, ఈ పిల్లలు కూడా ఆరోగ్యంగా ఎదగగలుగుతారు అంటున్నారు వైద్యులు.

పిల్లల్లో ప్రధానంగా మూర్ఛ, ఆటిజం, బ్రెయిన్ స్ట్రోక్ మొదలైన నాడీ సమస్యలుంటాయి. ఈ సమస్యలు జన్యుపరంగా సంక్రమించవచ్చు. పోషక లోపాలు, ప్రమాదాలు ఈ సమస్యలకు దారి తీయవచ్చు. కొన్ని సమస్యల తీవ్రత తక్కువగా ఉండొచ్చు ఇంకొన్ని పిల్లల ఎదుగుదలను దెబ్బతీస్తుంది. కాబట్టి పిల్లల్లో చోటుచేసుకునే నాడీ సమస్యల గురించి అవగాహన ఏర్పరచుకోవడం అత్యవసరం.

## మూర్ఛల్లో రకాలున్నాయి

పుట్టిన రోజు మొదలు పిల్లల్లో మూర్ఛలు కనిపించవచ్చు. మెదడులో అవసరం లేని ఎలక్ట్రికల్ యాక్టివిటీ చోటు చేసుకున్నప్పుడు మూర్ఛలు మొదలవుతాయి.

నెల లోపు పిల్లల్లో: అప్పుడే పుట్టిన పసికందుల్లో కూడా మూర్ఛలు రావచ్చు. వీటి తీవ్రత క్రమేపీ పెరగవచ్చు. మెదడుకు అందే ఆక్సిజన్‌లో కొరత ఏర్పడడం, చక్కెరల మోతాదు తగ్గడం, క్యాల్షియం, మెగ్నీషియం తగ్గడం వల్ల పసికందుల్లో మూర్ఛలు కనిపిస్తాయి. అలాగే మెదడులో రక్తస్రావం వల్ల కూడా మూర్ఛలు కనిపించవచ్చు.

4 నుంచి 8 నెలలు: ఈ వయసు పిల్లల్లో ఎపిలెప్టిక్ స్పాసమ్స్ సాధారణంగా కనిపిస్తూ ఉంటాయి. నిద్ర నుంచి లేచినప్పుడు అకస్మాత్తుగా ఉలిక్కిపడడం ఈ సమస్య ప్రధాన లక్షణం. ఈ సమస్య రెండు నుంచి మూడేళ్ల వయసొచ్చేవరకూ కొనసాగుతుంది. కొందరు పిల్లల్లో జీవితాంతం కొనసాగుతుంది

**నెల నుంచి ఏడాది:** మెదడు నిర్మాణంలో లోపాలున్నప్పుడు, జన్యు సమస్యలున్నప్పుడు, పోషకాల లోపం ఉన్నప్పుడు ఈ వయసు పిల్లల్లో మూర్ఛలు కనిపించవచ్చు.

**ఒకటి నుంచి ఐదేళ్ల లోపు:** ఈ వయసు పిల్లలను బినైన్ ఆక్సిపిటల్ ఎపిలెప్సీ వేధించవచ్చు. నిద్ర నుంచి లేవగానే వాంతి చేసుకుంటారు.

4 నుంచి 8 ఏళ్లు: ఈ వయసు పిల్లల్లో బినైన్ సెంట్రో టెంపొరల్ ఎపిలెప్సీ కనిపించవచ్చు. నిద్రలో ఒక నిమిషం పాటు మూర్ఛలు వేధిస్తాయి. పిల్లలకు 10 నుంచి 12 ఏళ్ల వయసొచ్చేటప్పటికి ఈ మూర్ఛలు వాటంతట అవే తగ్గిపోతాయి.

## మూర్ఛల చికిత్సలు ఇలా...

పసికందుల్లో పోషక లోపాలను భర్తీ చేయడం ద్వారా మూర్ఛలను అదుపు చేయవచ్చు. పెద్ద పిల్లల్లో తలెత్తే బినైన్ ఆక్సిపిటల్ ఎపిలెప్సీని మందులతో అదుపు చేసుకోవచ్చు. బినైన్ సెంట్రో టెంపొరల్ ఎపిలెప్సీలో ఆరు నెలలకోసారి ఏడాదికోసారి మూర్ఛలు వేధిస్తే, ఇఇజి పరీక్ష ఫలితం ఆధారంగా, మందులతో అదుపు చేసుకోవచ్చు. ఏడు నుంచి పదేళ్ల మధ్య పిల్లలకు ఆక్సిపిటల్ ఎపిలెప్సీలో కళ్లు మసకబారడం, తలనొప్పి లాంటి లక్షణాలతో పాటు స్పృహ కూడా కోల్పోతూ ఉంటే, మందులతో చికిత్స చేయవచ్చు. మూర్ఛలు లేకపోయినప్పటికీ మాట్లాడుతూ అకస్మాత్తుగా కొన్ని క్షణాల పాటు ఆగిపోయి మళ్లీ మాట్లాడడం లాంటి లక్షణాలతో కూడిన ఆబ్సెన్స్ ఎపిలెప్సీలో ఇఇజి ఫలితం ఆధారంగా రెండు రకాల మందులతో చికిత్సను అందించవచ్చు. పసికందుల్లో మూర్ఛలు మందులతో సమర్థంగా అదుపులోకొస్తాయి. ఎక్కువ సందర్భాల్లో మళ్లీ తిరగబెట్టకుండా ఉంటాయి. పిల్లల్లో తలెత్తే మూర్ఛలు అంతకంటే ఎక్కువ కాలం కొనసాగే అవకాశాలుంటాయి. వేరే రకాల మూర్ఛలకు దారి తీసే ముప్పు కూడా ఉంటుంది. అయితే మందులు సక్రమంగా వాడుకుంటూ, వైద్యుల సూచనలు పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి. మందులు ఆపిన తర్వాత కొన్ని మూర్ఛలు తిరగబెట్టే అవకాశాలు పది శాతం మేరకు ఉంటే, ఇంకొన్ని మూర్ఛలు తిరగబెట్టే అవకాశాలు 20 శాతం మేరకు ఉంటాయి. మెదడు నిర్మాణాల్లో లోపాలతో తలెత్తే మూర్ఛలను మందులతో నియంత్రించలేకపోవచ్చు. అలాంటప్పుడు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన కీటోజెనిక్ డైట్‌తో మూర్ఛల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ఒకవేళ మందులతో మూర్ఛలు అదుపులోకి రానప్పుడు మాత్రమే అంతిమ ప్రయత్నంలో భాగంగా వైద్యులు సర్జరీలను ఎంచుకుంటారు.

## ఆటిజం అదుపు

ఇది నాడీ అభివృద్ధి రుగ్మత. ఈ సమస్య ఎమ్మారై స్కాన్, రక్తపరీక్షల్లో బయల్పడదు. పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వయసొచ్చేలోపు పిల్లల మెదడులో 3 లక్షల కోట్ల నాడీ కనెక్షన్లు ఏర్పడతాయి. పిల్లలను ప్రేరేపించేకొద్దీ ఈ కొత్త కనెక్షన్లు ఏర్పడుతూ ఉంటాయి. ఇళ్లలో పిల్లల బాగోగులు చూసే వాళ్లు ఎక్కువ మంది ఉంటే ఈ కనెక్షన్లు ఎక్కువగా ఏర్పడతాయి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులై ఉండి పిల్లలకు తగినంత సమయం కేటాయించలేప్పుడు పిల్లల్లో ఎదుగుదల లోపాలు ఏర్పడతాయి. అలాగే మూడేళ్ల లోపు పిల్లలకు సెల్‌ఫోన్ లాంటి గ్యాడ్జెట్లను అలవాటు చేయడం వల్ల కూడా ఇవే ఎదుగుదల లోపాలు పెరుగుతాయి. బదులుగా పిల్లలకు మూడేళ్ల వరకూ గ్యాడ్జెట్స్‌ను దూరం చేసి, వాళ్లతో ఎక్కువ సమయం గడుపుతూ, ఎక్కువగా మాట్లాడే ప్రయత్నం చేస్తూ ఉండాలి. మన మాటలు పిల్లలకు అర్థం కావలసిన అవసరం లేదు. అయినా వీలైనంత ఎక్కువగా, మాటలు, పనుల ద్వారా పిల్లలను ఎంగేజ్ చేస్తూ ఉండాలి. ఉద్యోగస్తులైన దంపతులు పిల్లలను ప్లే స్కూల్లో చేర్పించడం మంచిది. బదులుగా పిల్లలకు గ్యాడ్జెట్స్ ఇచ్చినప్పుడు, వాళ్లకు కావలసిన కాలక్షేపం అడగకుండానే చేతికి అందుతోంది కాబట్టి మన మాటలకు, చేతలకూ స్పందించడం మానేస్తారు. గ్యాడ్జెట్స్ వల్ల పిల్లల్లో భాషాపరమైన సమస్యలు, సామాజిక సానుభూతి, ఆత్మీయులతో అనుబంధాల సమస్యలు తలెత్తుతాయి. పిల్లల్లో మాటలు ఆలస్యమవుతాయి. తల్లి ఎన్నిసార్లు పిలిచినా పలకరు, స్పందించరు. అకస్మాత్తుగా గట్టిగా అరవడం, ఆడుకుంటున్న తోటి పిల్లలను చూస్తూ ఆ ఆటలో పాల్గొనే ప్రయత్నం చేయరు.







ఓటీటీలో సంచలన విజయం సృష్టించిన టాలీవుడ్ పాపులర్ వెబ్ సిరీస్ సేవ్ ది టైగర్స్ మరో సీజన్ రాబోతుంది. పెళ్లిళ్ల, భార్యాబాధల నేపథ్యంలో సాగే హిలేరియస్ ఫ్యామిలీ కామెడీ డ్రామాగా వచ్చిన మొదటి రెండు సీజన్లు ప్రేక్షకులను పొట్టచెక్కలయ్యేలా నవ్వించాయి. ఇప్పుడు ఈ సిరీస్ ప్రేక్షకుల ముందుకు మూడో భాగంతో రావడానికి సిద్ధమవుతోంది. ప్రియదర్శి, అభినవ్ గోమఠం, కృష్ణ చైతన్య, సీరత్ కపూర్, జోర్దార్ సుజాత, పవని గంగిరెడ్డి, దేవియాని శర్మ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ను మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. మొదటి రెండు సీజన్లలో రాహుల్, విక్రమ్ ,ఘంటా రవి ల పాత్రలు ప్రేక్షకులకు విపరీతమైన వినోదాన్ని పంచాయి. ఎప్పుడెప్పుడు ఈ సిరీస్ నుంచి మూడో సీజన్ వస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా మేకర్స్ మూడవ సీజన్ రాబోతుందని అధికారికంగా తెలిపారు. దాంతో పాటు ఒక పోస్టర్ ని కూడా రిలీజ్ చేశారు. ఈసారి ట్రిబుల్ ఫన్.. ట్రిబుల్ ఫ్రస్టేషన్ ఉండబోతోందని తెలిపారు. ఇక ఈసారి స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ సైతం యాడ్ అయ్యాడు. 'వాళ్ళు దేవుడిని నమ్మారు.. కానీ, దేవుడు స్రిప్ట్ మొత్తాన్ని ఫ్లిప్ చేశాడు అని హింట్ ఇచ్చారు. దేవుడి గెటప్ లో వెన్నెల కిషోర్ కనిపించాడు. ఇక పోస్టర్ లో ఒకప్పుడు పెళ్ళాలు మాట విన్న మొగుళ్ళు.. ఇప్పుడు రివర్స్ లో ఉండడం చూపించారు. అంటే వారు వేరుగా .. వీరు వారుగా మారినట్లు తెలుస్తోంది. దీంతో ఈ సీజన్ పై అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. త్వరలోనే టైగర్లు వచ్చే టైమ్ ని టీమ్ అధికారికంగా తెలపనుంది. మరి ఈసారి ఈ ముగ్గురు టైగర్లు ఎలా నవ్విస్తారో చూడాలి.




టాలీవుడ్‌లో టాలెంట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకునే హీరోలలో సత్యదేవ్ ఒకరు. ఎప్పటికప్పుడు వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సత్యదేవ్ నటిస్తోన్న నూతన చిత్రానికి ఓ పవర్ ఫుల్ టైటిల్‌ని ఖరారు చేస్తూ.. శుక్రవారం (మే 22) ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సత్యదేవ్ నటిస్తోన్న 16వ చిత్రమిది. ఈ చిత్రానికి 'సమవర్తి' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, విడుదల చేసిన ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

'సమవర్తి' సినిమాను రుద్ర పిక్చర్స్ అండ్ పంచభూత ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వంలో ఎకో లాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకువచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ పోస్టర్‌లో సత్యదేవ్ చుట్టూ గొడ్డళ్ల, కత్తులతో కొందరు దూసుకు వస్తుండగా.., ఆయన ఎలాంటి భయం లేకుండా హెడ్ ఫోన్స్‌లో పాటలు వింటూ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఇంతకు ముందు ప్రకృతి, అడవి వాతావరణాన్ని బలంగా ప్రతిబింబించిన ప్రీ-లుక్ పోస్టర్.. ఈ సినిమా గురించి అంతా మాట్లాడుకునేలా చేసింది. ఇప్పుడు విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో, సత్యదేవ్ వెనుక కనిపించే పులి, కుందేలు ద్వారా ప్రకృతికి సంబంధించిన అంశాన్ని ఇందులో చేర్చి మరింత ఆసక్తిని పెంచారు. సత్యదేవ్ కెరీర్‌లో ఇదొక హై ఇంటెన్స్ యాక్షన్ మూవీ అవుతుందనే అంచనాలు టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌తో క్లారిటీ ఇచ్చారు మేకర్స్. ప్రత్యేకంగా ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ అనే కొత్త జానర్ ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచుతోంది. మొత్తంగా అయితే.. సత్యదేవ్ ఫుల్-ఫ్లెడ్జ్ యాక్షన్ స్పేస్ వైపు గేర్ మార్చినట్లుగా ఈ పోస్టర్ తెలియజేస్తోంది. చూద్దాం మరి.. ఈ జానర్‌లో ఆయన ఎలాంటి సక్సెస్‌ని అందుకుంటారో?




హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్‌పై నిర్మించిన చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమాతో వి. మునిరాజు దర్శకుడిగా పరిచయమైన విషయం తెలిసిందే. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రం థియేటర్లలో మంచి సక్సెస్‌నే అందుకుంది. ఈ సినిమా మే 15 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో నటించిన నటుడు ప్రదీప్ కొట్టె.. సినిమా సక్సెస్‌పై ఆనందం వ్యక్తం చేస్తూ.. అనేక విషయాలను షేర్ చేసుకున్నారు. "మాది చిత్తూరు జిల్లా పలమనేరు. చెన్నైలో జాబ్ చేస్తూ.. హైదరాబాద్‌కి షిఫ్ట్ అయ్యాను. ఇక్కడకు వచ్చాక షార్ట్ ఫిల్మ్స్ అంటూ యాక్టింగ్ వైపు వచ్చాను. బీ స్టూడియోలో బషీర్ మాస్టర్ నేతృత్వంలో కొన్ని నాటకాలలో యాక్ట్ చేశాను. ఆ నాటకాల్ని మా డైరెక్టర్ వి. మునిరాజు చూసి, 'తిమ్మరాజుపల్లి టీవీ'లోని 'రాజప్ప' పాత్ర కోసం ఆడిషన్ చేశారు. ఈ సినిమాకు కిరణ్ అబ్బవరం నిర్మాత అని తెలియగానే, సినిమాపై చాలా కాన్ఫిడెంట్ వచ్చింది. నేను చేసిన రాజప్ప పాత్రకు మంచి ప్రశంసలు దక్కాయి. నా తొలి చిత్రం, తొలి అవకాశం అంటే ఇదే అని చెప్పుకుంటాను. షార్ట్ ఫిల్మ్స్, ఇండిపెండెంట్ సినిమాలు చేశాను కానీ.. తొలి ఫీచర్ ఫిల్మ్, మొదటి సారిగా స్క్రీన్ మీద కనిపించింది మాత్రం ఈ చిత్రంలోనే. నేను నా జాబ్ చేస్తూనే సినిమా అవకాశాల కోసం ప్రయత్నించాను. వర్క్ ఫ్రమ్ హోం, లీవ్స్ అంటూ.. ఈ మూవీని కూడా మ్యానేజ్ చేశాను. నేను పూర్తి స్థాయిలో ప్రయత్నించలేకపోవడంతోనే ఇంత ఆలస్యమై ఉంటుందని భావిస్తున్నాను. గత పదేళ్ల నుంచి రెండింటిని బ్యాలెన్స్ చేస్తూనే ఉన్నాను. నాకు చిన్నప్పటి నుంచీ సినిమాలంటే ఇష్టం. నాకు అదొక ప్యాషన్ అని తెలీదు.




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ను భారత యువ క్రికెటర్, ఐపీఎల్ స్టార్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మెంబర్ వెంకటేష్ అయ్యర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ విషయాన్ని అల్లు అర్జున్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. టాలెంటెడ్ యంగ్ క్రికెటర్ వెంకటేష్ అయ్యర్‌ను కలవడం చాలా సంతోషంగా ఉందంటూ బన్నీ ఒక ప్రత్యేక పోస్ట్‌ను పెట్టారు. దీనికి సంబంధించిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సినిమా, క్రికెట్ ప్రపంచానికి చెందిన ఇద్దరు స్టార్స్ ఇలా ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో నటుడి అభిమానులతో పాటు.. క్రికెట్ లవర్స్ కూడా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ మీట్‌లో ఒక ఆసక్తికరమైన ముచ్చట జరిగింది. అల్లు అర్జున్ కుమారుడైన అల్లు అయాన్ కు వెంకటేష్ అయ్యర్ ఒక సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చారు. తను స్వయంగా సంతకం చేసిన స్పెషల్ క్రికెట్ ఆర్‌సీబీ జెర్సీని అయాన్‌కు బహుమతిగా అందించారు. తన కొడుకు కోసం ఇంతటి ప్రత్యేకమైన కానుకను తెచ్చినందుకు వెంకటేష్ అయ్యర్‌కు బన్నీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఫోటోలో అయాన్ ఆ జెర్సీని పట్టుకుని ఎంతో మురిసిపోతూ నవ్వుతూ కనిపించగా, పక్కనే అల్లు అర్జున్‌తో పాటు ఇండస్ట్రీకి చెందిన మరికొందరు ఆయన షేర్ చేసిన ఫోటోలో ఉన్నారు.




హాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద అప్పుడప్పుడు జరిగే అద్భుతాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎందరో యువ దర్శకులకు స్ఫూర్తినిస్తుంటాయి. సరిగ్గా అలాంటి సంచలనమే సృష్టిస్తోంది 'అబ్సెషన్' అనే సరికొత్త హారర్ చిత్రం. అమెరికా బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్‌తో దూసుకుపోతున్న ఈ సినిమా, రెండో వీకెండ్‌లో మొదటి వారాంతం కంటే ఎక్కువ కలెక్షన్స్ సాధించే దిశగా రన్ అవుతోంది. కేవలం డొమెస్టిక్ మార్కెట్‌లోనే ఆదివారం నాటికి ఈ చిత్రం ఏకంగా 50 మిలియన్ డాలర్ల మార్కును అందుకోబోతోంది. వరుసగా మూడో రోజు కూడా అమెరికాలో నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంటూ ఈ సినిమా సృష్టించిన ప్రభంజనం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఈ సినిమా బాక్సాఫీస్ పవర్ ఏ రేంజ్‌లో ఉందంటే.. పాప్ సంచలనం మైఖేల్ జాక్సన్ ప్రతిష్టాత్మక బయోపిక్ 'మైఖేల్' వసూళ్లను సైతం ఈ సినిమా అధిగమించింది. ఒక్క రోజు కలెక్షన్స్‌తో 'మైఖేల్' సాధించిన 2.6 మిలియన్ డాలర్లను అధిగమించి, 3.2 మిలియన్ డాలర్లతో 'అబ్సెషన్' టాప్‌లో నిలవడం చూస్తుంటే.. ఈ సినిమా కలెక్షన్ల సునామీకి అంతం ఎక్కడ? అనేలా టాక్ మొదలైంది. అత్యంత హింసాత్మక కథాంశంతో, ప్రేక్షకులను కుర్చీ అంచున కూర్చోబెట్టే ఒక అన్‌సెట్లింగ్ హారర్ డ్రామాగా 'అబ్సెషన్'ను రూపొందించారు. ఇందులో ఇండియా నవరెట్, కర్రీ బార్కర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. థియేటర్లలో ఈ సినిమా అందిస్తున్న హారర్ ఎక్స్‌పీరియెన్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085